# నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, శుక్రవారం 19 జనవరి 2024 | BHADRADRI KOTHAGUDEM


## 21న నేలకొండపల్లిలో ఆరోగ్య సమ్మేళనం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేవై రామచందర్‌రావు

ఖమ్మం, జనవరి 18: సిద్ధార్థ యోగా విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 21న నేలకొండపల్లిలో భారత జాతీయ ప్రకృతి ఆరోగ్య సమ్మేళనం నిర్వహించనున్నట్లు యోగా విద్యాలయం నిర్వాహకుడు డాక్టర్ కేవై రామచందర్‌రావు తెలిపారు. యోగా విద్యాలయం స్థాపించి 24 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఖమ్మంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జాతీయ సమ్మేళనానికి 6 రాష్ట్రాల నుంచేగాక అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా దేశాల నుంచి కూడా ప్రతినిధులు హాజరుకానున్నట్లు వివరించారు. అదేవిధంగా 100 రకాల దేశవాళీ బియ్యం, కూరగాయల విత్తనాలు, మగ్గం నేత, మట్టి కుండలు, భారత పురాతన మల్కం గేమ్ వంటి ప్రదర్శనలు ఏర్పాటుచేయనున్నట్లు వివరించారు. అనంతరం బాలబాలికలతో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. ప్రకృతి ప్రేమికులు, ఆరోగ్య అభిలాషులు పాల్గొనాలని కోరారు. అప్పారావు, రవి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గుబ్బల మంగమ్మ సేవలో ఎమ్మెల్యే తెల్లం



గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించుకున్న భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, జనవరి 18 : అశ్వారావుపేట సమీపంలోని గుబ్బల మంగమ్మ తల్లి ఆలయాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బీఆర్‌ఎస్ మండల నాయకులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరికెల్ల తిరుపతిరావు, ఉపాధ్యక్షులు రత్నం రమాకాంత్, చింతాడి చిట్టిబాబు, ఎండీ నవాబ్, కార్మిక శాఖ అధ్యక్షుడు చుక్కా సుధాకర్, యూత్ అధ్యక్షుడు గాడి విజయ్, కార్యదర్శి ఆకుల వెంకట్, పుల్లగిరి నాగేంద్ర, మాచినేని భాను, ఎండీ సుభాని, అవులూరి దుర్గాప్రసాద్, గాడి రాజేశ్ ఉన్నారు.



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

# ధర దగా..

- ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో మిర్చి వ్యాపారుల మాయాజాలం
- ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అనేట్లుగా పంట ధరలు
- పంట తక్కువొస్తే ధర పెంచడం.. అధికంగా వచ్చిన రోజు తగ్గించడం..
- ఒక్కరోజు వ్యవధిలోనే రూ.800 తగ్గించిన ఖరీదుదారులు
- పూర్తిస్థాయి పాలకవర్గం లేకపోవడంతో స్వయంగా పర్యవేక్షిస్తున్న డీడీ

ఖమ్మం వ్యవసాయం, జనవరి 18 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో మిర్చి పంట ధరలు స్టాక్ మార్కెట్ షేర్ల ధరలకంటే ఎత్తుపల్లాలను చూస్తున్నాయి. రైతులు పంటను తక్కువగా తెచ్చిన రోజు వ్యాపారులు ధరలు అమాంతం పెంచుతున్నారు. ఆ ధరలను పోల్చుకొని అన్నదాతలు అధికంగా పంటను తెచ్చిన రోజు సదరు వ్యాపారులు ఆ పంట ధరలను అంతే గణనీయంగా తగ్గిస్తున్నారు. ఇలాంటి ధరల దగా ఇక్కడ పరిపాటిగా మారింది. సాధారణంగా మార్కెట్లో ఏ వస్తువులకైనా, పంట ఉత్పత్తులకైనా 'డిమాండ్-సప్లై' సూత్రం వర్తిస్తుంది. దాని ప్రకారమే ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. అధిక దిగుబడులు వచ్చినప్పుడు, ఏక పంట మాత్రమే సాగైనప్పుడు సహజంగానే పంట ధరలు తగ్గుతాయి. పంట సాగు చేసిన రైతులు కూడా మార్కెట్లో ధరలను సీజన్‌కు ముందుగానే అంచనా వేస్తారు. అయితే, ఈ ఏడాది ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో విచిత్రమైన పరిస్థితి కన్పిస్తోంది.

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మిర్చి రైతులు ఈ స్థితి ఎదుర్కొంటున్నారు. నిరుడు మార్కెట్లో మిర్చి పంటకు డిమాండ్ ఉండి.. క్వింటాకు రూ.25 వేలకు పైగానే ధర పలికింది. దీంతో ఇళ్లలో, కోల్డ్ స్టోరేజీల్లో పంటలను నిల్వ పెట్టుకున్న రైతులు.. ఆ పంటను పూర్తిగా అమ్మేశారు. వ్యాపారులు కూడా కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ పెట్టిన పంటను ఇతర రాష్ట్రాల వ్యాపారులకు విక్రయించారు. దీంతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కోల్డ్ స్టోరేజీల్లోనూ నిల్వలు ఖాళీ అయ్యాయి. దీంతో ఈ వానకాలం సీజన్‌లో పంటను సాగు చేసిన రైతులు.. ధరలపై గంపెడాశలు పెట్టుకున్నారు. అయితే పంటలకు చీడపీడలు ఆశించడం, సాగునీటి కొరత ఏర్పడడం తదితర కారణాలతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో చేతికొచ్చిన కొద్ది పంటైనా సిరులు కురిపించడం ఖాయమని అనుకున్నారు. ధరల విషయంలో అధికారులు కూడా అలాగే అంచనా వేశారు. అయితే మిర్చి ఖరీదుదారులు సీజన్ ఆరంభంలో కొంతమేర ఆశించిన ధర పెట్టినప్పటికీ.. తీరా పంట చేతికొచ్చే సమయంలో రోజురోజుకూ ధరలను తగ్గించుకుంటూ వస్తున్నారు. ఇటీవల సంక్రాంతి సెలవుల ముందు మార్కెట్‌ను అంచనా వేసిన రైతులు.. ఇప్పట్లో మంచి ధరలు రావని అంచనా వేసి నిల్వ చేయాలనే ఆలోచనకు వచ్చారు. అయితే, సెలవుల అనంతరం బుధవారం మార్కెట్లో తిరిగి క్రయవిక్రయాలు ప్రారంభం కాగా.. కొందరు వ్యాపారులు రూ.21,300 చొప్పున గరిష్ఠ ధర పెట్టి కొనుగోలు చేశారు. దీంతో మళ్లీ రైతుల ఆశలు చిగురించడంతో బుధవారం వివిధ జిల్లాల నుంచి ఖమ్మం మిర్చి యార్డుకు భారీగా పంటను తెచ్చారు. రైతుల బలహీనతను కనిపెట్టారో ఖరీదుదారులు మరోసారి ధరలను అమాంతం తగ్గించారు.


ప్రతి సీజన్ లోనూ వ్యాపారులు ధరల పేరిట తమను దగా చేస్తూనే ఉన్నారని రైతులు వాపోతున్నారు. అందుకు అనుగుణంగానే పరిస్థితులు కన్పిస్తున్నాయి. వరుస సెలవుల అనంతరం బుధవారం మార్కెట్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజున జెండాపాటలో మిర్చి ధరను క్వింటాకు రూ.21,300గా వ్యాపారులు ఖరారు చేశారు. అయితే ఆ రోజున రైతులు తక్కువ మొత్తంలోనే పంటను తెచ్చారు. మంచి ధర ఉందనే ఉద్దేశంతో గురువారం రికార్డు స్థాయిలో 30 వేల బస్తాలను రైతులు తీసుకొచ్చారు. అనంతరం జరిగిన జెండాపాటలో ఖరీదుదారులు గడిచిన రోజుకంటే రూ.800 తగ్గించారు. రూ.20,500నే గరిష్ఠ ధరగా పెట్టారు. తర్వాతి గ్రేడుల పంటలను కూడా తగ్గింపు ధరలకే కొనుగోలు చేశారు. దీంతో రైతులందరూ ఆందోళనతో నిట్టూర్చారు. కొందరు రైతులు ఇక తప్పనిసరి పరిస్థితుల్లో తగ్గింపు ధరకే పంటను అమ్ముకున్నారు. మరికొందరు రైతులు పంటను కోల్డ్ స్టోరేజీలకు తీసుకెళ్లారు. విదేశాలకు ఎగుమతులు లేవని వ్యాపారులు చెప్పుకుంటున్నప్పటికీ ఒక్క రోజులోనే ధరను ఇంతలా తగ్గించడంపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ఒక్కరోజులోనే రూ.800 తగ్గుదల**

### క్రయవిక్రయాలను పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్

మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ రాజునాయక్ గురువారం కూడా ఖమ్మం ఏఎంసీలో క్రయవిక్రయాలను పరిశీలించారు. ప్రస్తుతం ఖమ్మం ఏఎంసీకి పాలకవర్గం లేకపోవడం, ఉన్నతశ్రేణి కార్యదర్శి సైతం బదిలీ కావడం, అసిస్టెంట్ సెక్రటరీ నియామకం జరగకపోవడం వంటి కారణాలతో పర్యవేక్షణ సక్రమంగా జరగడం లేదు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సైతం లేకపోవడంతో కొత్తగూడెం డీఎంవోనే రెండు జిల్లాల డీఎంవోగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో స్వయంగా డీడీనే ఏఎంసీలో ఉంటూ గ్రేడ్ టూ అధికారి బజార్‌తో కలిసి యార్డులో క్రయవిక్రయాలను పర్యవేక్షిస్తున్నారు.

## ఇన్‌స్పైర్, సైన్స్ ఫెయిర్ ఆన్‌లైన్



ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 18 : జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఇన్‌స్పైర్ ప్రాజెక్ట్‌లను ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు ఈ నెల 27వ తేదీ వరకు గడువిచ్చారు. అయితే జిల్లాలోని 109 ప్రాజెక్ట్‌ల కోసం 28 మంది పాఠశాలల హెచ్‌ఎంలు ఇంకా నమోదు చేయలేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో 109 ప్రాజెక్ట్‌లకు రూ.10వేల చొప్పున ఖాతాల్లో జమ చేయగా.. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు ప్రాజెక్ట్‌లు రూపొందించారు. ప్రాజెక్ట్ వీడియో, ఆడియో, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వీడియో నిడివి 2 నిమిషాలు, 30 ఎంబీ దాటకుండా ఉండాలని సూచించారు. అయితే గతంలో కొవిడ్ సమయంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ప్రదర్శన నిబంధనలను ఈసారి అమలు చేశారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి గుజరాత్‌కు చెందిన అభిలాష్ సమన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో పరిశోధనలు పరిశీలించి ప్రతి నమూనాకు 10 మార్కుల చొప్పున కేటాయించనున్నారు. ప్రతి జిల్లా నుంచి ఎంపికైన నమూనాల్లో 10 శాతం నమూనాలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఈ నెల 27వ తేదీ తర్వాత తేదీలను ఖరారు చేసి ఆన్‌లైన్‌లో ప్రదర్శనలను వీక్షించనున్నారు.

**20, 22వ తేదీల్లో సైన్స్ ఫెయిర్...**

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో గల పాఠశాలలకు చెందిన విద్యార్థులు విద్యా శాఖ సూచించిన అంశంపై ప్రాజెక్ట్‌లను రూపొందించగా.. సైన్స్ ఫెయిర్‌ను మాత్రం ఆన్‌లైన్ ప్రదర్శన ద్వారా నిర్వహించనున్నారు. ఇందుకోసం సైన్స్ అధికారి జగదీశ్వర్ ఆధ్వర్యంలో 8 మంది హెచ్‌ఎంలతో కూడిన బృందాలను ఎంపిక చేశారు. ఈ నెల 20, 22వ తేదీల్లో ఖమ్మంలోని రెజొనెన్స్ శ్రీనగర్ స్కూల్ కేంద్రంగా ఆన్‌లైన్ ప్రదర్శనలను వీక్షించి ఉత్తమంగా నిలిచిన వాటిని ఎంపిక చేయనున్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ప్రాజెక్ట్‌లను అంశాలవారీగా సంబంధిత బృందాలకు విభజించి అందజేయనున్నారు. ఈ ప్రక్రియను డీఈవో సోమశేఖర శర్మ పర్యవేక్షిస్తున్నారు.

## ఖమ్మం ఎంపీ సీటు అడిగే హక్కు నాకే ఉంది

- కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి
- ఇక్కడి నుంచి సోనియా గాంధీ పోటీ చేస్తే నాకు సంతోషమే..



ఖమ్మం : మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి

మామిళ్లగూడెం, జనవరి 18: కాంగ్రెస్ పార్టీ నుంచి ఖమ్మం ఎంపీ సీటు అడిగే హక్కు కేవలం తనకే ఉందని, అలాగే పార్టీ అగ్ర నాయకులు సోనియా గాంధీ ఇక్కడి నుంచి పోటీ చేస్తే తనకూ సంతోషమేనని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు రేణుకా చౌదరి స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసి జిల్లా అభివృద్ధి కోసం పని చేశానన్నారు. జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయించానని, ఖమ్మం- గార్ల వరకు రైల్వే ప్లాట్ ఫాంలను ఆధునీకరించామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తాను ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. అవసరమైతే భవిష్యత్తులో తమ పార్టీ టీడీపీతో కలిసి పనిచేస్తుందన్నారు. భద్రాచలంలోని రామాలయ అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి, అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శ్రీరాముడితో ఓట్ల రాజకీయాలు చేస్తున్నదని మండిపడ్డారు. అయోధ్యలో ఆలయ నిర్మాణం పూర్తి కాకముందే రాముడి ప్రతిష్ఠ చేయడం బాధాకరమన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఈ చర్యకు పూనుకున్నదని ధ్వజమెత్తారు.

## లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజం నిధులను పక్కాగా వినియోగించాలి

**రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 18 (నమస్తే తెలంగాణ)/ ఖమ్మం: వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలించేందుకు అధికారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజం(ఎల్‌డబ్ల్యూఈ) నిధులను పక్కాగా వినియోగించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. హైదరాబాద్‌లోని సీఎంవో కార్యాలయంలో గురువారం ఆయన భద్రాద్రి జిల్లాలో చేపట్టిన ఎల్‌డబ్ల్యూఈ పనులపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఏజెన్సీలో రహదారులు, బ్రిడ్జీల నిర్మాణంలో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా 76 పనులను రూ.341 కోట్లతో చేపట్టామని అధికారులు మంత్రికి వివరించారు. ఆయా పనుల్లో కేవలం 38 రహదారులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. మరో ఏడు రహదారులకు అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉందన్నారు. అభివృద్ధి పనులకు అవసరమైన అటవీశాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఏజెన్సీలో వ్యవసాయ రంగ అభివృద్ధి జరగాలంటే రహదారులతోనే సాధ్యమన్నారు. అభివృద్ధి పనులు సత్వరం పూర్తి చేసి గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు.

## ఎరువుల కొరత ఉండొద్దు : డీఏవో



ఖమ్మంలోని ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న డీఏవో విజయనిర్మల

ఖమ్మం వ్యవసాయం, జనవరి 18 : జిల్లాలో ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల అన్నారు. ఖమ్మం నగరంలోని పలు ఎరువుల దుకాణాలను ఖమ్మం డివిజన్ సహాయ సంచాలకుడు అజ్మీర శ్రీనివాసనాయక్‌తో కలిసి ఆమె గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చూస్తున్నామన్నారు. ఎరువుల దుకాణాల యజమానులు, డీలర్లు తప్పనిసరిగా పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) యంత్రాల సహాయంతోనే ఎరువులను విక్రయించాలన్నారు. జిల్లాలోని పంటల సాగుకు అనుగుణంగా ఎరువుల నిల్వలు ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అర్బన్ మండల వ్యవసాయ శాఖ అధికారి కిశోర్‌కు సూచించారు.

## రామజపం చేస్తున్న బీజేపీ

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**




సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ఖమ్మం కమాన్ బజార్, జనవరి 18 : పదేళ్ల తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంలోని బీజేపీ శ్రీరామజపం చేస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ జిల్లా సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోని పేద, మధ్యతరగతి వర్గాలకు సంబంధించి ఏ ఒక్క సానుకూల నిర్ణయం తీసుకోని బీజేపీ.. మతాన్ని ఎరగా చూపి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తుందన్నారు. ఆ పార్టీ తీరుతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. రాముని ప్రతిష్ఠ విషయంలో హిందూ మత పీఠాధిపతులు భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చినా ఎన్నికల నోటిఫికేషన్ దృష్టిలో ఉంచుకుని బీజేపీ తొందరపడుతోందన్నారు. బీజేపీ తర్వాత అతి పెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్ అన్ని పార్టీలను కలుపుకుపోయే ధోరణితో వ్యవహరించకపోతే మరోసారి నష్టం జరుగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా ప్రాంతీయ, జాతీయ పార్టీలకు కాంగ్రెస్ తగిన ప్రాధాన్యం కల్పిస్తే బీజేపీ ఓటమి తథ్యమన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు ఓట్లు వేసినందున పథకాల అమలుకు వారికి తగిన సమయం ఇవ్వాలన్నారు. సమావేశంలో పార్టీ జాతీయ సభ్యుడు బాగం హేమంతరావు, నాయకులు పోటు ప్రసాద్, దండి సురేశ్, మౌలాన తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పటిష్ట చర్యలు

**రూ.12 కోట్ల విలువైన 4.08 ఎకరాలను రక్షించాం: ఖమ్మం కలెక్టర్**



అధికారులు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమి

ఖమ్మం, జనవరి 18: ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ప్రభుత్వానివిగా రికార్డుల్లో ఉన్న స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయన కథనం ప్రకారం.. నగరంలోని ఖానాపురం ట్యాంక్‌బండ్ వద్ద సర్వే నెంబర్ 94లో 4.08 ఎకరాల స్థలాన్ని జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయ భవనం, రైతు శిక్షణ కేంద్రం ఏర్పాటు నిమిత్తం 2009లో అప్పటి ప్రభుత్వం కేటాయించింది. అయితే ఆ స్థలంలో ఉద్యానవన శాఖ అధికారులు నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచారు. ఈ స్థలాన్ని బీ.వీరారెడ్డి, రాంరెడ్డి అనే వ్యక్తులు ఆక్రమించి షెడ్లు నిర్మించారు. తాజాగా అధికారులు గుర్తించి ఆ షెడ్లను తొలగించి ఆ ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.12కోట్ల విలువైన ఈ ప్రభుత్వ స్థలాన్ని రక్షించేందుకు రెవెన్యూ, మున్సిపల్ శాఖల ద్వారా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ స్థలం రక్షణ కోసం ఫెన్సింగ్, సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఇకముందు అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా, ఆక్రమణలు జరుగకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎక్కడైనా ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


VIPASSANA EDUCATIONAL TRUST
HETERO INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
(Sai Spurthi Institute of Technology Campus)
B.Gangaram, Sathupally, Khammam District, Telangana - 507 303.
Mail ID : hipsr.principal@gmail.com

WANTED

1. Principal 2. Asso.Professors 3. Asst.Professors
4. Lab Technicians 5. Office Staff & Attenders

Interested and Qualified persons can send their resumes on or before 20.01.2024 by 5PM at the above address with all certificates and testimonials
Departments : Pharmaceutics, Pharmaceutical Chemistry, Pharmaceutical Analysis, Pharmacology & Pharmacognosy
Experience and salary will be as per the PCI norms.

Date : 17.01.2024
Secretary & Correspondent
Vipassana Educational Trust


## 'హరితహారం'లో 20 కోట్ల మొక్కలు నాటుతాం

**పీసీసీఎఫ్ సువర్ణ**



అటవీ ఉత్పత్తులను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ సువర్ణ

సత్తుపల్లి, జనవరి 18: హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్ల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నామని పీసీసీఎఫ్ సి.సువర్ణ అన్నారు. గురువారం ఆమె సీసీఎఫ్ భీమానాయక్‌తో కలిసి సత్తుపల్లి అర్బన్ పార్కును సందర్శించారు. అనంతరం పార్కులో వాకింగ్ ట్రాక్, వాచ్‌టవర్ ప్రాంతాలను పరిశీలించారు. అడవి జంతువుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన సాసర్ పిట్స్ నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం అటవీశాఖ ఏర్పాటు చేసిన ఫొటోఎగ్జిబిషన్‌తోపాటు అటవీ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. తర్వాత కిష్టారం అటవీశాఖ నర్సరీ, పెనుబల్లి మండలం భువన్నపాలెం వాచ్‌టవర్‌ను పరిశీలించారు. వారి వెంట జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీవో మంజుల, ఎఫ్ఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.


మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616